# భోగిమంటలు

[ కథానిక ]

= శ్రీ కడారు వోలుగురువాచార్య =

౧

"కీర్తిగాని అపకీర్తిగాని లోకులు చెప్పుకుంటూంది యేదో అదే లోకంలో పాతుకుపోతుంది తప్ప మన మనస్సులూ, మన ఆశయాలూ వున్నవి వున్నట్లు లోకానికి తెలియవుగదా!" అని బాబాయి అన్నమాటలు యిప్పటికీ నా చెవుల్లో గింగురుమంటూ, భోగిమంటలు చూస్తోన్నప్పుడల్లా బాబాయీ, ఆ దినాలూ, ఆ ఆశయాలూ కళ్లకు కట్టినట్లు కనబడుతోంటాయి. చిన్నప్పటినుంచీ కూడా బాబాయికి పిల్లలంటే యెంత అపేక్ష! యెంత మమకారం! చివరకు తనకూ కూతురు కలిగేసరికి జన్మ సార్థకం అయిపోయిందనుకున్నాడు. అంతేగాని పెంచి పెద్దదాన్ని చేసి కళ్లారా చూచుకోవడానికే తాను నోచుకోలేదని తన కేం తెలుసు? తన కర్మమే యిల్లా కాలిపోతూందని, తన నొష్టనే యిల్లా పొద్దుపోతోందని యెన్నడైనా అనుకోనైనా అనుకున్నాడా? ఆ ప్రేమాలింగనల్లో అల్లానే నిద్రపోతా ననుకున్నాడు గాని! తన జీవితనాక ఆనంద సాగరంలో చల్లని అనుకూలపవనాలు వీస్తోంటే చక్కగా జీవితయాత్ర చెయ్యగలదని మురిసిపోయాడు. అంతేగాని చివరకు తన బ్రతుకు బండలై పోతుందని, చుక్కానీ లేని నావ అయిపోతుందని కలగన్నాడా? తన ఆనందం నిరంతరానందం అవుతుందనీ, తన ఆశలు కొనసాగుతవనీ వెఱ్ఱివెఱ్ఱి వూహలు వూహించుకుంటూనే బలి అయిపోయాడు. ఇంతకూ మనం వొకటి తల పెడితే భగవంతు డొకటి తలపెడుతూంటాడని పెద్దలు అంటూంటారు. ఇందుకే నేమో!

"చివరకు లలితకోసమే నే నీ భూమిమీద యింకా వుంది" అంటూండేవాడు. "మా లలితకొక నాకు యింకేముందీ, చెప్పు" అంటూ పదిసార్లూ చెప్పుతూ వుండేవాడు. చివరికల్లా బిడ్డసుఖసౌఖ్యాలు చూచుకోవడానికి కూడా పెట్టిపుట్టకపోయాడు గదా! బొమ్మలు పెట్టుకుని తోటి బాలికలతో ఆటపాటల్లో ఐక్యమైన అమాయిక లలితను చూస్తోంటే హృదయం తలుక్కుపోతోంది. ఈ సంక్రాంతి ముగ్గులూ, గొబ్బెమ్మలూ, ధనుర్మాస వైభవం, యీ భోగిమంటలూ చూస్తోంటే నిజంగా ప్రతిఘడియలోనూ బాబాయి కన్నులగట్టినట్లు కనిపిస్తూ యేదో పరిభాషలో అడుగుతూంటాడు. అదే స్మృతికివస్తూ కళ్లంబడి నీళ్లు సుళ్లు తిరుగుతూంటాయి. వలపూరి మనసారగా ఆ జిగిబిగి రంగవల్లికల్లో రెండు కన్నీటి బిందువుల్ని బొటబొటా రాల్చడం నా అలవాటు. అంతకంటే వేరే నేను చేసేదికూడా యేం వుంటుంది గనుక?

గతించిన గాథంతా గుర్తుకు వస్తోంటే, ఇంత విచారంలోనూ లలితను చూచుకుని భావివూహలతో పాటు అవ్యక్తమైన ఆనందాన్ని దేనినో అనుభవిస్తోంటాను.

౨

ఆనాడు తెల్లవారితే భోగి అనగా దీపాలు పెట్టే వేళను టెలిగ్రాం రావడం, ఆదరా బీదరా నాలుగు మెతుకులు వేసుకుని పోస్టాఫీసుకు పరుగెత్తిపోవడం, ఏలూరులో వున్న నాన్నకు టెలిగ్రాం యివ్వడం—మరచిపోదా మనుకున్నా మరుపుకు రావడంలేదు. రైల్వేస్టేషనుకు రెక్కలు కట్టుకుని వాలినా అప్పుడే రైలు వచ్చివుంది. రైలులో పడేసరికల్లా కొంతవరకు ప్రాణం కుదుటపడినట్లు అయింది.

"మొన్న నేను బాబాయిఉయిలు రిజిష్టరు చేయించడానికి పోయి చూచునప్పటికి యింత వినయ

స్థితికి రాలేదే! అప్పటికి అంతగా ఏం లేదే! ఒకవేళ వ్యాధిగాని తిరగబెట్టిందేమో! అంతే అయివుండాలి. అందులోనూ మాయదారిత్రయ. ఇంతకూ తీరా వెళితే యేం కానుందో ఏమిటో" అని మనసు పరిపరి విధాల పరుగులెత్తింది. కొంతసేపటికి మనసు తిరుగ వేసుకుని దిక్షాసతోనే వోమూలకు వొదిగి చారబడ్డాను. అది మంచి నిశీథసమయం. చాలామట్టుకు ప్రయాణీకులు చలికి ముసుగులుతన్ని బల్లలమీద పడుకున్నారు. దీపాలు పారాయిస్తూ 'దొంగ లున్నారు జాగ్రత్త' అని హెచ్చరిస్తోన్నాయి. బయటంతా గాఢాంధకారం. నక్షత్రాలు మిలమిలా మెరుస్తోన్నాయి. కొన్ని రాలిపోతోన్నాయి కూడా. రంయ్యమని చల్లని గాలి విసరివిసరి కొడుతోంటే కిటికీలు మూసుకుని కూర్చుండిపోయాను. ఆ నిశీథంలో రైలుధ్వని తప్ప యింకేం వినబడ్డం లేదు. పొలాల కట్లంబడి బుసలు కొడుతూ పరుగులు తీస్తోన్న నల్లత్రాచుకుమల్లే రైలు సన్నని ఆవిరియీలలతో పొగలు క్రక్కుతూ ఆ నిశీథంలో చొచ్చుకుపోతోంది. రైలు ముందుకు సాగుతూన్న కొద్దీ మరుక్షణంలో యేం వినిపోతానో గదా అన్న ఆందోళన పెరుగుతూ వచ్చింది. కృష్ణాకెనాల్ దాటగానే గుండె గుభేలుమంది. 'ధన్ ధానాధన్- ధన్ ధనాధన్' అన్న శబ్దం చేసుకుంటూ కృష్ణాబ్రిడ్జిమీద రైలు పరుగులెత్తుతోంటే నాలో కూడా ప్రతిశబ్దించింది. చల్లని యేటిగాలికీ, రైలు చేస్తోన్న ధ్వనికీ మేల్కొన్నవాళ్లు కాస్తా చలిముసుగులు చెవులమీదికి లాక్కుంటూ ఆ కటికి చీకటిలో ఘోషిస్తోన్న కృష్ణవేణివైపు చూపులు నిగుడించారు.

అందరూ మాటా మల్లే సర్దుకుంటూ 'బెజవాడ వచ్చింది! వచ్చింది!' అనుకుంటూంటే నాగుండె దద్దరిల్లిపోయింది. కాళ్లు తడబడ్డాయి.

రైలుదిగి యింకా అన్నదానసమాజంవద్దనే నడుస్తోన్నాను. అప్పుడే ఖంగు ఖంగున పన్నెండు గంటలూ తాలూకాఫీసులో ఠకాయించారు. పన్నెండూ పన్నెండు దెబ్బల్లా త్రుళ్లిపడుతూ ఏలూరు రోడ్డు మీదికి తిరిగేను. దరీ దాపా! ఇంకా మైలున్నరుంది. "ఊళ్లో దివ్యమైన మేడ వుండికూడా చల్లని గాలి కోసం అని ఆ మాచవరంలో ఆ పూరికొంపలో అగచాట్లుపడుతూ ప్రొద్దుపుచ్చవలసినగతి పట్టిందిగదా! ఆహా రోజులు ఎలా తారుమారు ఔతోంటాయి!" అన్న ఆలోచనలతో ఐనకాడకు అంగలు వేసుకుంటూ నడిచాను.

అరండల్ పేటగేటు దాటినతర్వాత ఆ దీపాలు కాస్తాకూడా లేకుండా పోయినాయి. కొంతదూరంలో ఎఱ్ఱని దీపం మినుకుమినుకుమంటోంది. తీరా సమీపించేసరికి రోడ్డుకు అడ్డంగా పెనుభూతానికిమల్లే నల్లని రోడ్డుయింజను. ఎఱ్ఱనిదీపం డేంజరులైటూను! ఇంకా చాలాదూరం వుందే, పోయిపడేది ఎప్పుడురా అన్న ఆదుర్దాతో ఉరుకులూ పరుగులూ పెట్టేనని చెప్పవచ్చు.

నిశాదేవత నల్లని కురులు విరబోసుకుని స్వేచ్ఛావిహారం చేస్తూండే సమయం అది. రోడ్డుకు యిరువైపులా అలుముకుపోయిన చింతలవరుసలు మరింత అంధకారా'న్ని ఆవరింపజేస్తోన్నాయి. కన్ను పొడుచుకున్నా దారీ తెన్నూ కనబడ్డంలేదు. రోడ్డుప్రక్కల్ని వున్న జొన్నచేల మీదనుంచీ, కందిచేల మీదనుంచీ ధ్వనులు చిత్రవిచిత్రంగా వస్తోన్నాయి. కీచురాళ్ల ధ్వనికి అంతూ పొంతూ లేనేలేదు. పాములచే పట్టుబడి బెకబెకలాడే కప్పల బెకబెకలకు గుండె ఝల్లుమన్నమాట నిజం! అప్రక్కనే మీద వచ్చిపడుతూం దేమో అన్నట్లున్న నల్లని కొండ! పంచప్రాణాలూ అరచేతుల్లో పెట్టుకుని, 'జీ' అంటూన్న ఆ చీకటిలో, ఎదురుగాలితో పెనుగులాడుతూ ముందుకు పోతోన్నాను. కాని, అణిగీఅణగని రోడ్డు అవడంవల్ల ఒకొక్కసారి యే మూదిరాయి అయినా కాలిక్రింద పడిందా, ఇక ఆ చలిలో జివ్వున ప్రాణం మింటికెగిరిపోయేది! నేను పుట్టి యిన్నాళ్లు అయిందిగాని ఎన్నడూ వొంటరిగా—అందులోనూ యిల్లాంటి చీకటిరాత్రులలో ప్రయాణంచేసిన పాపాన్ని పోలేదు. బాబాయికి ఎలా వుందో అన్న ఆందోళన ఎక్కువౌతోన్నకొద్దీ ముందుకు అంగలువేస్తూన్నాను. కాని ఒక వైపునుంచి ఆత్రుత ముందుకు తోస్తోంది; మరొక ప్రక్కనుంచి భయం వెనక్కులాగుతోంది. త్వరగా

పోవాలి! బండ్లా లేవు; చెప్పులా ఎక్కడ వదిలేశానో గుర్తేలేదు. ఏమైనా తప్పేదిలేదుగా? కాలం కర్మం యిల్లా కూడివస్తోంటాయిగదా అనుకుంటూ ఏకాగ్ర చిత్తుణ్ణయి, "నా కష్టసుఖాల కేంలే? బాబాయి వుంటే అదే పదివేలు" అనుకుంటూ ముందుకు పోతోన్నాను.

'బిక్కుబిక్కు' మంటూన్న నాహృదయానికి దూరంగా ఎక్కడో కనబడుతోన్న భోగిమంటలు నా గమ్యస్థానాన్ని తెలియజేస్తోన్నాయి. మాచవరం ఆంజనేయస్వామిగుడివద్ద అప్పుడే భోగిమంటలు వేసుకుని చలి కాగుతూ పుక్కిడిపురాణాలు చెప్పుకుంటూన్నారు. నేనూ చేరవలసిన యింటివద్దకు వచ్చేశాను.

ఇంట్లోంచి దీపపుకాంతులు బయటకు ప్రసరిస్తోన్నాయి. లోపలినుంచి చిన్న దగ్గూ, అస్పష్టమైన రెండుమూడు మాటలూ వినబడ్డాయి. మరేమీ ఆదుర్దా లేదనుకుని తెలుసుకోగలిగినా బాబాయిని ఎంతలో చూస్తానా అని తొందర ఎక్కువైంది.

## 3

తలుపు నెట్టుకుని లోపలికి పోయాను. చుట్టపక్కాలందరూ చూడడానికి వచ్చి అక్కడే తెలివేసి వున్నారు. ఒక్కొక్కరూ నెమ్మది నెమ్మదిగా బాబాయి స్థితిగతులు చెప్పేరు. సరాసరి బాబాయి వున్న గదిలోనికి పోయాను. ఆయన నిద్రపోతూన్నాడు. కళ్లు పీక్కుపోయాయి. ఎముకలుకూడా లెక్కపెట్టవచ్చు! దవడలు ప్రక్కలకుతన్ని, వికారస్వరూపం యేర్పడింది. క్రొత్తవాళ్లకు భయం కలిగినా కలగవచ్చు! మా అలికిడి కాగానే తేటిపాఱజూచి, "వచ్చావా?" అంటూ గుమ్మంవంక చూస్తూ, "నాన్న రాలా?" అని అడిగేడు. ఆకంఠంలో ఎంత ఆదుర్దా వుంది? ఏమిటో మరి, ఆ కంఠధ్వనులు వినేసరికల్లా నా నాళనాళాల్లోకి ఆధ్వనులు వ్యాపించి కట్టలు తెగేసిన దుఃఖం పొర్లుకొచ్చింది.

నాన్న ఏలూరు వెళ్లారనీ, నేను టెలిగ్రాం యిచ్చాననీ, తప్పక తెల్లవారుజామున రావచ్చుననీ చెప్పేను. చిన్న దగ్గుతెఱ వచ్చి ఉమ్మివూసి, తిరిగి రగ్గు కప్పుకుంటూ, "ఇంకా నిలబడే వున్నావా? అలా కూర్చో నాయనా" అన్నాడు. తొలగిన రగ్గును నేను సర్దబోయాను. "నాతోనే పోనీ నాయనా... యీమహమ్మారిని" అంటూ తానే సర్దుకొన్నాడు. మొదట ఆయన ఎంత ఆరోగ్యవంతంగా వుండేవాడో చివరికల్లా అంత క్రూరవ్యాధికి బలిఅయిపోయాడు. చేతులూ, కాళ్లూ ఎండిపోయి చూడడానికే అసహ్యంగా వున్నాయి.

"అయ్యో! రామా! నాకు అన్నగారిని చూచే యోగ్యతకూడా లేకుండా చేశావా?" అంటూ ఆయన పరితపించిపోయాడు.

"అలా అనుకోకండి బాబాయ్" అని నేను అనగానే, "అన్నయ్య వుదయమే వస్తాడుగానీ, నామాట విని మాట్లాడకుండా కొంచెంసేపు నిద్రబోరా మధూ" అని నానమ్మకూడా అంది.

"ఇక ఎలానూ మాట్లాడను. ఏం మాట్లాడినా ఏం చేసినా తెల్లవారు వరకేగా? ఆతర్వాత మీ బాబాయ్ మళ్లీ మాట్లాడబోతాడా? మీరూ వినబోతారా? హూ!" అంటూ బాబాయి నిట్టూర్పుచ్చాడు.

"పదిసార్లూ అదేమాట అనకండి బాబాయ్" అని నేను అనకుండా వుండలేకపోయాను. "పడుకోండి, బాబాయ్, పడుకోండి! నిద్రకూడా లేకపోతే మరీ డీలా అయిపోతారు" అని అక్కడనుంచి లేచి ముందుగదిలోకి వచ్చి కూర్చున్నాను.

"వద్దని ఎంత మొత్తుకున్నా యింతవరకూ ఆ యిరుగుపొరుగు వాళ్లందరినీ చూసి ఒక్కొక్కరికీ జోశ్రీతిమం చెప్పి చెప్పి యిప్పుడే కన్నుమూశాడు. వాళ్లందరూ, పాపం, యింతవరకూ యిక్కడే వున్నారు. ఇప్పుడిప్పుడే వాళ్లూ అల్లా గుమ్మం దాటేరు, నీవూ యిల్లా వచ్చావు" అని నానమ్మ చెప్పింది. ఏదో మంచి చెడ్డా నానమ్మతో మాట్లాడుతోంటే బాబాయ్ పిలిచినట్లైంది. నేనూ గదిలోకి పోయాను, ఆయనా నోరు చాపి సైగచేశాడు. ఆ పక్క బల్లమీదనే ఫ్లాస్కు

వుంటే తీసి పాలు నోట్లో పోశాను. రెండంటే రెండు ఔన్సుల పాలుమాత్రం గుటకలువేశాడు.

"అబ్బ! ప్రాణం లేచివచ్చినట్లైంది" అంటూ నా ముఖంవైపే నిదానించి చూశాడు. ముఖం కొంచెం ముచ్చెమటలు పోశాయి. ఏదో ఆలోచిస్తూ "అన్నట్లు చెప్పడం మరచిపోయాను — మాపిన్ని నీకు బాగా గుర్తుంది కదూ?" అని ప్రశ్నించాడు. ఆ కళ్లల్లో ఎన్నో భావాలు యిమిడి వున్నట్లు కనబడ్డాయి.

"అల్లా అన్నారేం బాబాయ్? పిన్ని గుర్తులేకపోవడం ఏమిటే?" అని నేను అనేసరికల్లా, 'ఊఁ...' అంటూ నాముఖం ఎగాదిగా పారచూస్తూ "అల్లా కూర్చో" అన్నాడు. ఇంతవరకూ కాంతిలేని ఆ కళ్లు ఆ క్షణంలో ప్రకాశించాయి. ఆ కళ్లల్లోనూ, ఆ ముఖ విలాసాల్లోనూ ఆదుర్దా, ఒకవిధమైన ఆనందం వుట్టిపడ్డమాట నిజం. పోనీ విందాం, ఏం చెప్పతాడో గదా అని ఒకవైపూ, అసలే నీరసంగా వున్నాడే అన్న సంకోచం మరోవైపూ పీకుతోంటే అల్లానే కూర్చుండి పోయాను. అయినా మధ్యమధ్య ఆగుతూ, చిన్నదగ్గు దగ్గుతూనే నెమ్మదినెమ్మదిగా చెప్పడం మొదలుపెట్టేడు. ఈ అంత్యక్షణాలలో ఏం చెప్పబోతాడోగదా అని నేనూ భక్తిశ్రద్ధలతో వినాలనే కూర్చుండిపోయాను. తనకు అనుకూలంగా తలగడ సర్దుకుని యిల్లా చెప్పడం మొదలుపెట్టేడు:

౪

"నా బాల్యంలో ఎంత అల్లరి చేసేవాడినో నాకే అర్థంగాదు. ఆ రోజులు ఇప్పుడు గుర్తుకొస్తోంటే 'అబ్బా! నిజంగా ఎంత అల్లరిచేసేవాడ్ని' అని నామట్టుకు నాకే ఆశ్చర్యం వేస్తూంటుంది. స్కూల్లో అల్లరి పిల్లవాళ్లల్లో నేనూ ఒకణ్ణి. ఏదైనా అల్లరి జరిగిందంటే 'మధూ ఎక్కడ?' అని ముందు నా ఆచూకీ తీసుకుండేవారు. ఆరోజుల్లో నేనంటే అంత పలుకుబడి వుండేదన్నమాట. అయితే మా తాతగారి ముఖం చూచి నన్ను ఎవరూ ఏమీ అనలేకపోయేవారు. ఆ అలవాటు చొప్పుననే పంతులుగారి యిల్లు తగలబడ్డనాడు కూడా చెప్పమని నన్ను నిర్బంధించారు. కాని, నిజంగా ఆయిల్లు తగలబెట్టడంలో కుట్ర నాకు తెలియనిమాట వాస్తవమే! ఆ సంగతి నాకు అప్పటికీ యిప్పటికీ కూడా తెలియదు. తెలిసికోవాలని నేను ప్రయత్నమూ చెయ్యలేదు. అల్లా బాల్యం గడిపి మంచీ చెడ్డా వివక్షత తెలుసుకునే యింగితజ్ఞానం వచ్చేసరికి యింత నా అల్లరీ ఏమైపోయిందీ నామట్టుకు నాకే బోధపడేది కాదు. ఆరోజుల్లో నేనూ పెద్దమనుష్యుల్లో ఒకణ్ణి. 'ఆ అల్లరిమధూయేనా ఈనాడు యిల్లా మధుసూదనుడు అయింది' అంటూ నన్నెరిగిన నలుగురూ నాబాల్యం తలచుకుని నవ్వుకునేవారు. నాకూ పెద్దలమీదా, పెద్దపెద్ద ఆశయాల మీదా గట్టి నమ్మకం ఏర్పడింది. పదిమందిలోనూ నేనూ ఓ మనిషినేనని తల యెత్తుకు తిరుగుతోన్న దినాలవి. ఆ రోజులు, ఆ వైభవం, అసలా జీవితమే వేరు. నాజీవితంలో స్వర్ణదినాలవి!

౫

"ఇప్పుడివన్నీ ఎందుకని నీ వనుకోవచ్చు. కాని యివన్నీ వున్నది వున్నట్లు యింతవరకూ రెండో కంటికి తెలియదు. చెప్పితే గ్రహించుకోగలవాళ్లకు చెప్పకపోతే నా హృదయభారం తీరేదెలా చెప్పు?" అని చిన్నదగ్గు దగ్గుతూ, తిరిగి ప్రారంభించాడు.

"ప్రపంచం అంతా ధనధాన్యాలతో తులతూగుతూ కన్నుల పండువుగా వుండే దినాలవి. కలకల్లాడే నిండు ముఖాలతో ప్రయాణీకులు చుట్టపక్కాలిండ్లకు పరుగులు తీస్తోన్న పర్వదినాలవి. నేనూ శెలవలు రాగానే పెట్టే బేడా సర్దుకుని యింటికి బయలుదేరాను. నా అలవాటుచొప్పున ఏదో పుస్తకం చదువుకుంటూ రైల్లో కూర్చున్నాను. అంత జనసమ్మర్దంలోనూ నా కల్పనారాజ్యవీథుల్లో విహారిస్తోన్నాను. ఏదో ఒక స్టేషనులో బండి ఆగింది.

'ఎలాగు బామ్మా! బండి కదిలేటట్లుంది' అన్న ఆ కిన్నెరకంఠం ఎలానో చదువుకుంటోన్న నాచెవుల్లో పడింది! వెనక్కి తిరిగి చూశాను. ఒక యువతి, ముసలమ్మా నేనున్న పెట్టెదగ్గ నిలబడి వున్నారు. జనం

త్రోసుకుని మరీ ఎక్కుతున్నారు. వాళ్ల ఆతురత, అమాయికత్వం చూస్తే నాకే జాలివేసింది. వెంటనే తలుపు తెఱచి ఎక్కమంటిని. వారూ అడావుడిగా లోనికి మూటలందించి బండెక్కేరు. 'మా బాబూ, నీకు వెయ్యేళ్లాయుస్సు! సమయానికి ఆదుకున్నావు నాయనా! లేకుంటే యీవాళ మాగతేంకాను?' అని ముసలమ్మ మేలు తలచింది. వాళ్లిద్దరూ కృతజ్ఞతా సూచక దృష్టితో నాయెదుటి బల్లపైననే కూర్చున్నారు. పెట్టె జనంతో కిక్కిరిసి వుంది. ఎన్నడూ లేంది నేను ఆనాడెందుకో ఆయువతిని చూడాలని తాపత్రయ పడ్డమాట నిజం! 'ఏమిటో నాయనా! మారోజుల్లో యిల్లా బళ్లు వున్నాయా? మేం ఎక్కేమా, పెట్టేమా? మాయగోల!' అంటూ పిచ్చాపాటీ నాతో ముసలమ్మ మాట్లాడుతోంటే మధ్యమధ్య మా ప్రస్తావన యువతి వింటూనేవుంది. ఆమెను యెక్కడో చూచినట్లు గుర్తుంది కాని ఫలానా చోటనీ, ఫలానా అనీ గుర్తులేదు. తరుచు నాదృష్టి ఆయువతిపైపే పోతోండేది. దబ్బపండులాంటి పచ్చని శరీరానికి ఆ ఆకుపచ్చని సిల్కుచీరా, ఆ ఊదారంగు జాకెట్టూ చూడసొంపుగా వున్నాయి. నల్లని ముంగురులు గాలిలో ఎగురుతూ నన్నే వుజ్జూత లూరించాయి. ఒక్కొక్కప్పుడు పరస్త్రీని చూడగూడదని నా చూపుల్ని బలవంతంగా వెనకకు లాక్కుండేవాణ్ణి. పేజీలు త్రిప్పుతూనే వుండేవాణ్ణి కాని మనసు తటాలున ఆసుదతి విలాసాల్ని జ్ఞప్తివస్తోండేది. పుస్తకం చదువుతోన్నా ఆముక్కుతీరు, చంద్రబింబంలాంటి ముఖం మీద దోబూచులాడుతోన్న ఆనల్లని ముంగురులు, పద్మ రేకుల్లాంటి ఆ నల్లని కళ్లూ కనబడుతూ నన్ను ముగ్ధుణ్ణి చేశాయి. దొంగచాటుగా చూస్తోన్న నన్ను ఆమె కనిపెట్టేవుండవచ్చు. లోకానికి జడిసీ, మనస్సుకు లొంగీ అప్పుడప్పుడూ చూస్తోనే వుండేవాణ్ణి. ఒకసారి ఆయువతి గుర్తించి ఒక్కసారిగా ఆత్రుతతో చూపులు బయటకు మార్చుకుంది. నిజంగా ఆచూపులు నాకళ్లల్లో నుంచీ కాదు, నాహృదయంలోనుంచే దూసుకు పోయాయి. హృదయంలో చివుక్కున బాణం వచ్చి గుచ్చుకున్నట్లు అయింది. నఖశిఖ పర్యంతం ఒక్కసారిగా పులకరించింది. నా రెండుకళ్లూ కైపెక్కిన తుమ్మెదల్లా అయిపోయినాయి. నాగుండెధ్వని నాచెవులకు వినిపించింది! మనస్సులో ఆలోచనలు పుట్టుకొచ్చాయి. రైలు వేగంగా పోతోంది. ప్రయాణీకుల మాటలు రైలురొదలో మునిగిపోయాయి. త్రోవ పక్కలనున్న నీటి మడుగుల మీదనుంచి సూర్యకిరణాలు పెట్టెలోకి ప్రతిబింబిస్తోన్నాయి. ఆమెముఖంలో ఎక్కడలేని శాంతమూ వుట్టిపడుతోంది. నేను ఆయువతిని చూస్తోండడం తప్పుకావచ్చు. కాని, నేను ఆమెఅందచందాలను చూఱగొనకుండా వుండలేక పోయాను. రోజూ నే నెంతమంది యువతుల్ని చూడడం లేదు? నాజీవితంలో యీ సంఘటన జరిగినట్లు ఎన్నడూ జరుగలేదు. యింతకంటే వెయ్యిరెట్లు అందంగా వున్న అందగత్తెలను చూచిననాడుకూడా నామనస్సు ఒక్క అంగుళమైనా ముందుకు దూకి ఎరుగదంటే నమ్మ నామాట. కాని ఆనాడు నాలో కలలోనైనా అనుకోని మార్పు జరిగింది. ఎందువల్లంటే ఏం చెప్పేదీ? ఎందుకో నాకే అర్థంకానప్పుడు యితర్లకేం చెప్పేది? ఆ సుగుణవతి ముఖంలోనే హృదయభావాలుకూడా ఇమిడి వున్నాయి.

వాళ్లూ నాతోపాటు బెజవాడ స్టేషనులోనే దిగేరు. ఆమెను విడిచిపెట్టాలంటే నామనస్సు దిగులు దిగులుగావుంది. నా దుర్బలత్వానికీ, నా అమాయకత్వానికీ నాలో నాకే సిగ్గేసింది. 'ఆమెఅందచందాలను చూస్తూ మురియడానికి నాకేం అధికారం వుం'దని ప్రశ్నించుకుంటే నాకే జవాబురాలేదు.

'ఇక మేం వుంటాం నాయనా! పాపం! సమయానికి బిడ్డడులాగ ఆదుకున్నావు. అంతేచాలు' అని ఆమె అనేసరికి యిక నేను విడువక తప్పింది కాదు. మాటల ధోరణిని ఆయువతిపేరు 'సుభద్ర' అనిమాత్రం తెలుసుకోగలిగేను. అంతకు మినహా వాళ్లను గూర్చి నేను అట్టే భోగట్టా చెయ్యలేక పోయాను.

౬

"నాకు ఆనాటినుంచీకూడా అప్పుడప్పుడు సుభద్రముఖం కళ్లకు కట్టినట్లు కనబడేది. ఆ

పరిచయపు జాడలు నాలో హత్తుకుపోయి స్థిరస్థాయి యేర్పరుచుకున్నాయి.

'అయ్యో! వాళ్ల యిల్లు ఎక్కడనో కనుక్కోక పోతినిగదా' అని అప్పుడప్పుడు మనసు నొచ్చేది. అదే తలచుకుంటూ ఎన్ని గాలిమేడలు కట్టుకునే వాణ్ణి!

అల్లా పది పదిహేను దినాలు గడిచినాయి. అవాళ భోగి పండుగో, లేక సంక్రాంతే నేమో. మొత్తానికి ఏదో ఆ రెండు మూడు రోజులలోనిదే కావచ్చు! ఆసంవత్సరం అక్కయ్యకూతురుచేత క్రొత్తగా బొమ్మలు మన యింటివద్దనే పెట్టించాం. పేరంటాండ్రు వచ్చే వేళయిందిగదా అని నేనూ బయటకు పోతోన్నాను. ఇంతలో మన దక్షిణవరండాలో సుభద్ర–ఆయువతే!–ఎదురైంది. అదే చీర! అదే జాకట్టు! నాకళ్లను నేనే నమ్మలేకపోయానంటే నమ్మ! ఏమేమిటో ఆలోచనలు గుమ్మరించినట్లు అయిపోయింది. ఆమెకూడా విస్తుపోతూ వెనకకు తగ్గింది.

'సుభద్రా! యిలా వచ్చావేం?' అన్న మాటలు అప్రయత్నంగా ఆమెను చూడగానే నోరుజారేయి. సుభద్రా అని పిలవగానే చప్పున ముఖం పైకెత్తి చూస్తూ, 'పేరంటానికి' అంటూనే గబగబా వెళ్లిపోయింది. ఆమెకళ్లు ఆశ్చర్యంతో మెరిసిపోయాయి. చెమట చెమర్చిన బొట్టు ఆ ముఖాని కెంతో అందాన్ని యిచ్చింది. ఎడతెగని ఆలోచనలతో బయటకు పోయాను. ఆమె మళ్లీ కనబడికూడా నేను కనుక్కుంది ఏమిటే అని మనస్సు వేధించింది. పోనీ యివాళ కాకపోతే రేపైనా తెలియకపోదుగదా' ఎలానూ యింట్లో వదినకు తెలుసుగదా అన్న ధీమాతో వుండేవాణ్ణి!

అప్పటిలో మన దొడ్డివైపు వున్న యింటికీ, మనయింటికీ మధ్య దొడ్డిలో గుమ్మం వుండేది. మనం ఆవీథిలోకి పోవాలన్నా, వాళ్లు యీవీథిలోకి రావాలన్నా యిదే త్రోవ. వాళ్ల దగ్గరనే మొదట మనం యిల్లు కొనుక్కుని తర్వాత విప్పికట్టుకున్నాం.

ఆరోజు ఆవీథిలోకి పోవాలిసివుండి దొడ్డి గుమ్మం సందున శేఖరంగారి యింట్లోంచి పోతోన్నాను. ఇంతలో శేఖరంగారు నన్ను చూచి పిలిచేరు. ఆయనకు నేనంటే అమిత వాత్సల్యం. గౌరవమూను! మనం వారిల్లు కొనుక్కుని అప్పటికి మూడు నాలుగు సంవత్సరాలు కావస్తోంది. అప్పటినుంచీ కూడా వాళ్లూ మనం కలిసీ మెలిసీ ఒక యింటిలో వాళ్లలాగే మెలిగేవాళ్లం. ఏకష్టసుఖం వచ్చినా ఆయన నాకు చెప్పే అలవాటు వుండేది. నేను వయస్సుకు చిన్నవాడినే అయినా ఆయన చెప్పతూండడం, నేను వింటూండడం పరిపాటైపోయింది.

అవాళా మామూలుగానే పోయి కూర్చున్నాను. నే వచ్చి పది పదిహేను రోజులు అవుతూన్నా ఏదో వ్యాపకంమీద అటు పోనేలేదు. శేఖరంగారైనా యింటివద్ద వుంటే నాకు కబురు తప్పక పంపేవాడే మరి. పాపం! యీ మధ్య వాళ్ల చెల్లెలు చనిపోవడంవల్ల అక్కడకు వెళ్లీ రావడంలో తనకు వీలులేకపోయిందని చెప్పేడు. మంగళగిరిలో వాళ్ల చెల్లెలు వుంటూండేది. పాపం! ఆమెదీ బీదసంసారం. మొగుడేదో బడిపంతులు. ఆయనకాస్తా పోయి అప్పటికి రెండుమూడు సంవత్సరాలు కావచ్చు. ఆమెకు ఒక కూతురో, కొడుకో వున్నట్లు నాకు గుర్తుంది. కాని యింకా గుర్తుచాలదు. అంటే యీమధ్య ఐదారు సంవత్సరాలనుంచి వాళ్లకూ వీళ్లకూ మాటామాటా పట్టింపులు వచ్చి రాకపోకలు లేవు. పాపం! ఎప్పుడైనా చాటునా మాటునా ఆయన చెల్లెలు సుబ్బాయమ్మగారు కబుర్లు పంపుతూండేది. శేఖరంగారికి ఆచెల్లెలంటే అమిత ప్రేమ! 'పాపం ఆమెకూడా పోయిందీ?' అని నాలో నేనే విచారిస్తూ, శేఖరంగారు పూలమాల గ్రుచ్చుతూంటే చూస్తూ కూర్చున్నాను. ఆయనా పూలమాల గ్రుచ్చడం పూర్తిచేస్తూ 'బాబూ ఎంతపని జరిగిందో! ఆ వెధవచెల్లెలైనా బ్రతుకకూడదూ? అదీ పోవాలా? పాపం! మా మేనగోడల్ని వాళ్ల నానమ్మ మొన్ననే తీసుకొచ్చి దిగవిడిచి పోయింది. కొడుకు పోయినా యింతవరకూ ఆమెకాబట్టి సాగుకొచ్చింది. ఇంకోరూ యింకోరూ అయితే చేస్తారటండీ? ఆకోడలు కాస్తా కూడా పోయింది. పాపం ఆమెకూ పెద్ద కాలం

పోయిన పాడుగూతా ఎంతకాలమని వీళ్లను పెట్టుకుని తాపత్రయపడగలదు? అది మనకుమాత్రం యేం లాయకీగా వుంటుంది? ఏదో కృష్ణా రామా అనుకుంటూ యింత తిని ఒక మూల పడి వుండవలసిన రోజు లాయె. అంచేత నాకే మనస్కరించక పిల్లను పంపమన్నాను. ఏదో నా ఓపినశక్తి కొలదీ చూస్తాను. ఏమంటారు?' అని అతను చెప్పుతూంటే వింటూ కూర్చుండి పోయాను.

ఇంతలో లోపలినుంచి గబగబా ఒక యువతి వచ్చి అంతవరకూ గ్రుచ్చిన మాలను తిరిగి గుచ్చుతూ కూర్చుంది. మా మాటలు విని ఆమె యిటు తిరిగి చూచేసరికి నాకు ఎక్కడలేనీ ఆశ్చర్యం కలిగింది. అప్పటి ఆమెముఖం ఆశ్చర్యాన్నీ, ఆదుర్దానీ తెలియచేస్తోంది.

“ఇదే మా మేనగోడలు” అని శేఖరం చెప్పుతూంటే ఆమెవైపు ధైర్యంగా చూశాను. ఆరోజు సుభద్రలో ఒక క్రొత్తదనం నాకు కనిపించింది. నాకు ఆశ్చర్యం వేసింది. అన్నిటికంటే ఒకవైపు ఉత్సాహం ఎక్కువైంది. ఒక పర్యవసానానికి వచ్చినట్లు మనస్సు నిబ్బరపడింది. నేనూ అల్లా పరధ్యానంగా వుంటే తిరిగి శేఖరంగారు యిల్లా అన్నారు: ‘చూశారా రోజులు ఎలా వస్తోన్నాయో! ఒక్కొక్కరోజు మీదపడుతోన్నకొద్దీ ఖర్చుమీద ఖర్చు వచ్చిపడుతోంటే ఎల్లా సంసారం కోలుకుంటుందో చెప్పండీ? పిల్లాజల్లా నలుగురు కలవాళ్లంగాని ఒంటెత్తుకాదు గదా! ఇప్పుడు మా సుభద్రమ్మపెళ్లి ఒకటి నా నెత్తిమీద పడింది. చూశారా? నా బీదస్థితినిబట్టి రత్నంలాంటి పిల్లను ఏ అయ్యచేతుల్లో పెట్టాలిసి వస్తుందోగదా అని ముందు నాకే బెంగపట్టుకుంది' అని చెప్పుతోంటే ఆయనకళ్లల్లో నీరు నిండింది. అది నే కనిపెట్టకపోలేదు.

‘అప్పుడే ఒక సంబంధం కూడా వచ్చింది. నేను ఆకుఱ్ఱాణ్ణి మొదటినుంచీ ఎరుగుదును. మొదటనుంచీ కూడా ఆషామాషీగా తిరిగిన రకం అది. అటువంటి వాడికి యీవాళ యేదో నాలుగు డబ్బులు గడిస్తూన్నాడంటే ఎలా యివ్వనూ చెప్పండీ? ఎంత నే ప్లీడరీగుమాస్తానైనా వాళ్లా వీళ్లా చేతుల్లో రత్నంలాంటి పిల్లను పెట్టడానికి ఎలా మనసు ఒప్పుతుంది చెప్పండీ? ఇదంతా ఎందుకు చెప్పుతూన్నానంటే బీదవాళ్లన్నా, వాళ్ల సంబంధాలన్నా అల్లా వుంటాయని. లేకపోతే అక్కడాఅక్కడా వంటలు చేసుకునే వంటవాడికి, పూర్వంనుంచీ పేరుప్రకాస్తులు గల యింటి ఆడబోడుచును, యీనాడు బీదవాళ్లని యెవరిస్తారండీ? వాడి సాహసానికే నాకు ఆశ్చర్యం కలుగుతూంది' అని శేఖరుగారు చెప్పుతూంటే నాలో నాకే ఆవేశం కలిగింది. ఆసమయంలో సుభద్ర వెనక్కి తిరిగి ఒకమాటు తలెత్తిచూసి ముఖం వంచుకుంది. ఆమె పెదవులు సిగ్గుతో కదలినై. సిగ్గుతో వంచుకున్న ఆ ముఖమూ, చొట్టపడిన ఆమె లేత బుగ్గలూ నన్ను మరింత వుత్సాహపరిచాయి. అల్లా శుభవార్తతో యింటికి తిరిగి వెళ్లిపోయాను. ప్రతి శుక్రవారం భజనకు తప్పకుండా వెళుతూంటే కిన్నెరకంఠంలోనుంచి వచ్చే ఆ కమ్మని పాటలకు హృదయం కరిగిపోయేది.

౨

“ఆనాటినుంచీ మాలో ఒకరిమీద ఒకరికి అనురాగం పాలుపొంగినట్లు పొంగుతూవచ్చింది. రోజుకు ఒక్కదఫా అయినా ఒకరి క్షేమాన్ని ఒకరం తెలుసుకోలేకుండా వుండలేకపోయినమాటే నిజం! సుభద్రను వదలి గుంటూరులో వుండే ఆకొన్నిరోజులూ కొన్ని సంవత్సరాలలాగ గడిపేవాణ్ణి. అక్కడకూ శని ఆదివారాల్లో బెజవాడ వస్తూపోతూనే వుండేవాణ్ణి. ఆకాలేజీజీవితంలో ఒక కల్పనారాజ్యంలాగ విహరించేవాణ్ణి. అప్పుడే నాభావిజీవితం సుభద్రమీద ఎల్లా ఆధారపడివుందీ, ఆమెకు దూరమై జీవించటం ఎంత కఠినమైందీ, ఎంత ఆవేదనకరమైందీ తెలుసుకోగలిగేను. అది నీవు ప్రేమే అను, కామమే అను, మరేమైనా అనుకో. అయితే నేను చెప్పేదిమాత్రం యథార్థం! ప్రేమమాత్రం చాలామంది అపోహపడుతూన్నట్లు కామవాంఛకు దూరమైందిమాత్రం కాదు. ఒక యువతిని నీవు ప్రేమించి, పెళ్లిచేసుకోవాలనుకున్నప్పుడు అందు కామవాంఛ లేకపోలేదు. పైపెచ్చు ఆప్రేమాభివృద్ధికి కామంకూడా ఒక ముఖ్యా

భారమే! నేను కామించలేదు కాని ప్రేమించానని చెప్పేవారి మాటలుమాత్రం అసత్యమనీ, అసంభవమనీ, స్వానుభవంమీద చెప్పే మాటలుమాత్రం కావనీ తెలుసుకో.

'ఆమె ఎప్పటికైనా యితరుల సొత్తు అయిపోయేదేనుమా!' అన్న చింత నన్నెప్పుడూ బాధిస్తూనేవుండేది. అయితే ఒకొక్కప్పుడు ఆశకూడా కలగకపోలేదు. 'ఈమాట మీమనస్సులో వుంచుకుని ఎక్కడైనా మంచి సంబంధం వుంటే చెప్పాదురూ?' అని శేఖరంగారు నాన్నతోనూ, నానమ్మతోనూ అనేకసార్లు చెప్తుతూ సంప్రదిస్తూ వుండడంవల్లనూ మన మాటకు అడ్డుచెప్పడని ఒక గట్టి నమ్మకం వుంది. 'నిజంగా అత నీపరిస్థితుల్లో, మనలాంటి బాంధవ్యం కుదరాలేగాని, నెత్తినిపెట్టుకోడూ?' అన్న ధైర్యం నాకు బాగా వుండేది. అంచేత, ఒకప్పుడు కాకపోతే ఒకప్పుడైనా 'సుభద్ర నాభార్యే' అన్న అధికారం నాలో ఆవేశించేది. సుభద్రకూ యీవిషయం బాగా తెలుసు.

నేను బెజవాడలో వున్నన్నాళ్లూకూడా సుభద్ర మనయింటికి రావడమో, లేక నేనే వారింటికి వెళ్లుతూండడమో జరుగుతూండేది. ఒకొక్కనాడైతే యిద్దరం డాబామీద ఆ బాదంచెట్టునీడల్లో కూర్చుని ఏమేమిటో మాట్లాడుకుంటూ గడిపిన వెన్నెలరాత్రులు అనేకం వున్నాయి. చల్లని వేసంగిగాలిలో అల్లాడుతోన్న కొబ్బరిమట్టల నీడలు మామీద పడుతోంటే, ఆకాశవీథుల్లో తనకు అడ్డులేదనుకుని మేఘాల మాటునుంచి పరువులుతీసే చంద్రుని చూస్తూనే తెల్లవారిపోయిన రాత్రులుకూడా లేకపోలేదు. ఏమేమిటో మాట్లాడుకుంటూండేవాళ్లం. అప్పటిలో మాలో ఎన్నెన్నో సంగతులు ఆవరించేవి. మాటలతోనే మా దినాలు గడిచేవి. నిజంగా అల్లా గడిపిన ఆ రాత్రుల లోనే ఎంత ఆనందమైనా వుండేది. ఒకరి ఆత్మలను ఒకరం బయలుపెట్టుకుంటూ, ఒకర్ని ఒకరం అర్థం చేసుకుంటూ ఎంత హాయి అనుభవించేవాళ్లం! యిల్లా రాత్రులు కలుసుకోవడానికి కారణం నేనేనని చెప్పాలి. పాపం! ఆమె భయపడేది. ఎవరు చూసి ఏం అనిపోతారో అని భయపడుతూనేవుండేది.

౫

"ధరిమిలా యీసంగతి మన యింట్లోనూ, వాళ్ల యింట్లోనూ తెలిసింది. శేఖరంభార్య సుభద్రనుకొంచెం ఘాటుగానే మందలించినట్లు తెలిసింది. శేఖరంగారు కూడా 'నీకూ తెలియని విషయం కాదే! యిల్లాంటి నడతలు మన యింటా ఒంటా ఎన్నడూ లేవుసుమా! జాగ్రత్తగా నలుగురిలోనూ తలయెత్తుకు తిరిగేటట్లు మాత్రం ప్రవర్తించు. ఇంట్లో నాలుగ్గోడలనడుమా వుండే మీ కేం తెలుస్తుంది లోకపుభోగట్టా? మీఅమ్మ గౌరవం నిలబెట్టి, మామాట మాకు దక్కించుతూ నీ గౌరవం నీవు కాపాడుకో' అని సమగ్రంగా అదిలించీ బెదిరించీ చెప్పాల్సినతీరుగా చెప్పేడు. కాని నాతో మట్టుకు ఎవరూ ఆ ప్రమేయం యెత్తలేదు. కాని ఒకనాడు ఏదో మాటలధోరణిని 'ఒకరి గౌరవాన్ని కాపాడుతూ మన గౌరవాన్ని నిలబెట్టుకోవడమే మన విధి సుమా, మధూ!' అని అన్నయ్య హెచ్చరించాడు. అది నే గ్రహించకపోలేదు. అయితే ఆనాడు నాకు అన్నీ తెలిసివుండికూడా 'ఒకరి గౌరవానికి అంత రాయం కలిగే పని నే నేం చేశాను గనుక?' అని నాలో నేనే తృప్తిపడ్డాను. 'ఎవరో గ్రుడ్డిలోకులు అనుకుంటే వాటిని నే పాటించి నమ్మేదా? నా అంతరాత్మయే నాకు సాక్షి! ఒకరి వూహాపోహలతోనూ, ఒక రిచ్చే గౌరవాగౌరవాలతోనూ నాకు పనిలేదు' అన్నంత ధీమాగా వుండేవాణ్ణి ఆరోజుల్లో.

నాతో ఇదివరకు ఎంత చనువుగా, ఎంత ఆప్యాయంగా మాట్లాడేవాడో యిప్పుడూ శేఖర్ అల్లానే అంత గౌరవంతోనూ మనసిచ్చి మాట్లాడుతోన్నాడు. కాని అతని భార్యమాత్రం నావైపు కొంటకొంటచూచేది.

౬

"క్రమక్రమంగా మావిషయం యావత్తూ ఆనోటా ఆనోటా యిరుగు పొరుగు వాళ్లందరి చెవులకూ

ప్రాకిపోయింది. వాళ్ల గుసగుసల్లో మావిషయంకూడా ఒక పరమరహస్యమైంది. ఎలా పొక్కిందో ఏమిటో మరి, అప్పుడే వూరంతా యీవార్త పొక్కిపోయింది. నాస్నేహితుల్లో కూడా మాటల్లో కొన్ని ములుకుల్లాంటి మాటలు తగిలేవి. నవ్వుతూనే వాళ్లు విషం కొస్తా క్రక్కుతోండేవారు. మొదటిలో నాతో ఎంత గౌరవంగా మాట్లాడేవారో యిప్పుడూ అల్లానే మాట్లాడేవారు. కాని అందులో కొద్ది హేళనభావం మాత్రం వుంటూనే వుండేది.

స్నేహబృందంలో సుభద్రకుకూడా ఎత్తిపొడుపులూ, నిష్ఠూరాలూ పడడం పరిపాటై పోయింది. మొదటిరోజుల్లో చాలావరకూ తుడుచుకునిపోయే వాళ్లం. కాని పోను పోను ఏవిషయంలోనూ అదే అడ్డువచ్చేది. ఒకదాని కొకటి చిలవలుపలవలు అల్లుకొని యిరుగుపొరుగువారి మనస్సుల్లో చెలగాటలు ఆడేవి. నిజంగా మేం మంచిచేసినా చెడుచేసినా ప్రపంచానికి అది వెక్కిరించినట్లుగానే కనబడేది.

సుభద్రతోనే నాకు వివాహం చెయ్యవలసిందనీ, వాకు యిక అడ్డుచెప్పవద్దనీ చెప్పాలిసిన రీతిగా నా నమ్మతో చెప్పేశాను. నామాటలు నానమ్మకు ఆశ్చర్యంకలిగించినా ఏమీ అనలేకపోయింది. మొదటిలో నాన్నఎదుట పడి చెప్పకపోయినా తర్వాత చెప్పాల్సి వచ్చి చెప్పేశాను. కాని నామాటలు వాళ్లు వినిపించుకో లేదు. నిరాకరించారు కూడా. దానికి కారణం మరేం లేదు. అంతకు ముందే మనకు కావలసిన చుట్టరికంలో ఒక పిల్లనుచూచి నగకూడా పెట్టివున్నారు. అయితే అందులో నాయిష్టాయిష్టంగాని, నా సాధక బాధకాలుగాని విచారించి చెయ్యలేదు. అసలు ఆసందర్భంలో నాప్రమేయమే లేదు. వాళ్లు నాతో సంప్రదించకపోయినా చివరకు తెంపుజేసి, నాకు అప్పుడే సంబంధాలు చూడవద్దనీ, వివాహం యింతలో చేసుకోననీ కూడా ఖచ్చితంగా చెప్పేను. ఇంకా ఆవిషయం పమసిపోనేలేదు. ఇంతలో యిది అప్రయత్నంగా తటస్థించింది.

పైగా నేను పరస్త్రీని కన్నెత్తిచూడనైనా చూడననీ, యిల్లా మారిపోవడానికి కారణంకూడా సుభద్ర అనీ వారికి గట్టినమ్మకం. అంచేత సుభద్ర అంటే వారికి కొంచెం కిట్టనిమాట నిజమే! కాని వాళ్లకు నిజానిజాలు ఏం తెలును? 'అయినా మీ నిజానిజాలతో మాకేం పని? పదిమందీ యిప్పుడు ఏమనుకుంటున్నారో, యికముందు ఏమనుకోబోతారో అదే మాకు కావాలి. నీవు మావాడవని మేం నమ్మినా లోకం హర్షించవద్దూ? నలుగురూ నమ్మనిదే నేమాత్రం యెల్లా శిరసావహించగలను? యిల్లాంటివి లోకంతో పనిగాని నీతోనూ నాతోనూ అయేవా చెప్పు, మధూ? నేను యింతకన్నా యింక ఏం చెప్పను? నీధోరణి నీదే కాని కాస్తంత సంగతిసందర్భాలు వినిపించుకోక పోతే ఏలాగు చెప్పు?' అన్నవే వారి వుద్దేశ్యాలు. కులంవాళ్ల యిళ్లల్లో ఎక్కడవిన్నా యిదే గొడవ! యిదే సంగతి!

ఆమెగౌరవమర్యాదలకు లోపం తెచ్చిపెట్టింది నేనేగదూ? ఇంటా, బయటాకూడా సుభద్ర అపరాధిని అయివుంది. ఇంతకులటని అనుకో లేదని చీదరించుకునే వారు. మన యింట్లోనూ యిదే భావం అంకురించింది. అంచేత మనవాళ్లు నామాట విన్నారుకారు. 'అన్ని విధాలా కాస్తో కూస్తో వుండి పరువుప్రతిష్ఠలు గల కుటుంబంలో పిల్లను చేసుకోవాలిగాని యెందుకూ యీరణపెంకి' అంటూండేవారు. దీనికంతకూ కారణం నేనేగదూ అని నామనస్సు అప్పుడప్పుడూ చివుక్కుమనేది. ఎంత మంచి శీలవతి అయివుండికూడా యీ లోకనిందకు తల వంచుకోవలసివచ్చింది. దీనివల్ల సుభద్రలో వుండే పూర్వవుత్సాహం యిప్పుడంత లేదని నే గ్రహించకపోలేదు. నాకూ యీవిషయంలో తొందర కలిగింది. కాని, సమయం రావద్దూ?

## ౧౦

"ఆనాడు రాత్రి ఒంటిగంట కావచ్చును. అప్పుడే చంద్రుడు నడినెత్తిమీదకు వచ్చేశాడు. కొబ్బరిచెట్ల నీడల్లో కూర్చుని సుభద్రరాకకోసం ఎదురు చూస్తోన్నాను. ఆమె వస్తూనే ఆరోజు వాళ్లయింట్లో రసాభాస జరిగినట్లు చెప్పింది. దానికి కారణం ఒక సంబంధం వచ్చిందనీ, ఖాయపరుచుకుని నగలు పెట్టాలనుకున్న వాళ్లకు కాస్తా మన సంగతి కర్ణాకర్ణికగా

తెలిసి చీత్కారం చేసుకుంటూ వెళ్లిపోయారనీ, శేఖరం కోపాన్ని పట్టలేక నిప్పులు కురిపించాడనీ మాత్రం చెప్పింది. నేను అంతకన్నా వివరాలు అడగనూలేదు, ఆమె చెప్పనూలేదు. తర్వాతకూడా ఎన్నడూ సుభద్ర యీవిషయాలే యెత్తలేదు.

'ఏమిటి యీరసాభాసంతా! నాకేమీ పాలుబోవడంలేదు. ఇదంతా ఒక అగమ్యగోచరంగా, ఒక పెద్ద అగాథంగా కనబడుతూంది.' అంటూ కళ్లవెంట ఎంతో నీరు కార్చింది. అభిమానంతో ఆమెహృదయం బ్రద్దలయిపోయింది. అల్లానే ఆలోచనలతో కూర్చుండిపోయాం. వెన్నెల పిండిఆరబోసినట్లుంది. నేను ఆలోచనలో పడ్డాను.

ఎంత ఆలోచించినా, ఏం ఆలోచించినా చివరకల్లా ఒకటే మార్గం కనబడుతోంది. ఇల్లాంటి క్లిష్ట సమయాల్లో, ఏదీ పాలుబోనప్పుడు మానవ మనస్సులు భయానికికూడ దూరం అయిపోతాయి. మనస్సు ఆశవైపుకే మొగ్గుతోంటుంది. సరిగ్గా ఇవ్వాళిటికి ఒకమాసంనుంచి నే నీ సంగతే ఆలోచిస్తూన్నాను. చివరకు తేలింది యిదీ. 'ఇంట్లోనా? యిష్టంలేదు. వారి మాట పాలిస్తే? సుభద్ర అధోగతిపాలు కావలసిందే. ఆమెకు మరో వివాహానికి మనస్సు ఒప్పనిమాట నిజం. కాని, యివాళ కాకపోతే రేపైనా సుభద్రకు వివాహం అవకతప్పదు. అయితే అది ఎన్నాళ్లు? సుభద్రయిష్టాయిష్టాలమాట అల్లా వుండనీ. పైగా యిప్పుడు కాకపోతే పెళ్లి అయిన తర్వాతైనా సుభద్ర అత్తవారికి తెలియకపోదు గదా? దానితో ఆమెజీవితం ధ్వంసమైపోయిందనే చెప్పవచ్చు. సమయం వచ్చినప్పుడల్లా ఆమెబాల్యాన్ని గుర్తు తెచ్చుకుని వాళ్లు విషపుమాటలు అంటూ ఏమైనా హైన్యంగలరు. ఆ వచ్చే భర్తహృదయంలో సుభద్ర ప్రియుడు తప్ప సుభద్రమాటే వుండదు. అయితే సుభద్రసుఖంకోసం నన్ను కన్నతల్లినీ, తోడబుట్టిన వాళ్లనూ కష్టపెట్టడమా? మామాట విని, మాకోర్కె ప్రకారం నడవలేదే అని వారికి విచారం వుండవచ్చు. అయితే వారికి మాత్రం సుభద్రకు జరిగేటంతటి అన్యాయం మాత్రం కాదు. నాలుగు కాలాలపాటు సలక్షణంగా బ్రతకాల్సిన సుభద్ర బ్రతుకు నీరుకారిపోయిందంటే — ఆమె సంసారం విచ్ఛిన్నమైపోయిందంటే కారణం నేనే గదూ? ఇంతకూ యిప్పుడు దెబ్బతినేది సుభద్ర' అన్న ఆలోచనలు నాకు ఇవాళ క్రొత్తవి కావు. సుభద్ర కొబ్బరిచెట్టు నానుకుని ఆకాశంవైపు చూస్తూ ఏమిటో ఆలోచిస్తోంది. తెల్లని దూదిపింజలలాంటి మబ్బుతునకలు గాలిలో తేలిపోతోన్నాయి. కొబ్బరిమట్టల నీడలు మా ముఖాల మీద ఆడుతూన్నాయి. చివరికొక పర్యవసానానికి వచ్చాను. అందరితోనూ చెప్పవలసినంత దూరం చెప్పేను. నాదేం తప్పు వుందీ? వాళ్లు ఎలానూ యిష్టపడరని నాడే తేలిపోయింది. ఇక శేఖరంగారంటావూ? ఆయనమాత్రం 'మీ పెద్దవాళ్ల యిష్టం లేందే నేమాత్రం ఏం చెయ్యనూ' అనక తప్పదు. అంచేత అన్నివిధాలా వాళ్లకు దూరమైపోవడమే శ్రేయస్కరమని అప్పటిలో అనిపించింది. నే నీ మాట చెప్పేసరికి నా కళ్లల్లోకి తీక్ష్ణంగా చూసింది సుభద్ర. ముఖం తెల్లపోయింది. మనసు దిగులుపడింది. 'వెళ్లిపోవడమే! ఆ పేరు తలుస్తోంటేనే గుండె గుభేలుమంటోంది. అంతపనే...' అంటూ విస్తుపోయింది. ఈ పని మాటలతో అయేది కాదనీ, అందులో సాధకబాధకాలు వున్నాయనీ నాకూ తెలుసు. కీడులో మేలుకుమల్లే! వీటి కన్నిటికీ అండ నేను ఉద్యోగం చేస్తూండడమే. అదీ లేకపోతే చెప్పేవా యిక మా పాట్లు. ఇక చేసేది యింతకన్నా మరొక గత్యంతరం లేక సుభద్రకూడా ఒప్పుకోక తప్పింది కాదు.

౧౧

"అప్పటికి మూడు నాలుగు గంటలసమయం కావచ్చు. వెన్నెల పుచ్చపువ్వులా వుంది. మంచుకూడా పడుతోంది. సుభద్ర పక్కదుప్పటిని ఆపాదమస్తకమూ కప్పుకుని నెమ్మదిగా నా వెనకాలనే వస్తోంది. ఎవరైనా చూస్తోన్నారా అని నాలుగు దిక్కులూ పరకాయించి చూచాను. అంతా నిశ్శబ్దంగా వుంది. మధ్యమధ్య కోడికూతలు మాత్రం వినబడుతున్నాయి. మన చావిడి తలుపు దగ్గరకు లాగి,

ఎవరైనా ఎదురుపడతారేమో అన్న భయంకూడా లేకుండా ముందుకు సాగేను. సుభద్ర కూడా నన్ననుసరించే అడుగులు వేస్తోంది. అల్లా గేటువరకూ వచ్చాం. గేటు వేసేవుంది. నెమ్మదిగా నేనే గేటు తెరిచాను. మమ్మల్ని రమ్మని చిరపరిచితురాలైన రోడ్డు ఆహ్వానిస్తోంది. ఒకసారి యిద్దరమూ వెనక్కి తిరిగి మన మేడవైపు ఓక్షణం చూశాం. ఆలస్య మయితే ఎవరన్నా చూస్తారేమో అన్నభయం నాకేం లేదు. ఆ వెన్నెలవెలుగుల్లో మన మేడ-కాదు, ప్రపంచ మే నిద్రపోతూన్నట్లు కనబడింది. కన్నీరు తుడుచుకుంటూ సుభద్ర నాతోపాటు ముందుకు తిరిగి, అడుగుల్లో అడుగులు వేసుకుంటూ గేటు మలుపు తిరుగబోతున్నాము. ఇంతలో 'మధూ' అన్న కేక మేడవైపునుంచి వినవచ్చింది. ఆకేక ఆవెన్నెల వెలుగుల్లో ఆ మేడంతా, ఆ దొడ్డి అంతా కూడా దద్దరిల్లింది. ఆ కేక అన్నయ్యదని తెలుసుకున్నాను. ఆ కంఠధ్వనిలో ఎంత కరుణరసం వుందీ? ఎంత తెగింపు వుందీ? అదే నన్ను వెనక్కి తిరిగిచూడనిచ్చింది. నా కళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగేయి. అన్నయ్య వస్తూన్నాడు. కళ్లనీళ్లు తుడుచుకుని నేనూ దిటవుగా నిలబడ్డాను. అన్నయ్య వస్తూనే 'మధూ' అని మా యిరువురివంకా ఒక్కసారి ఎగాదిగా చూశాడు. 'సుభద్రమ్మా! ముందు నీవు యింట్లోకి వెళ్లివుండు' అనేసరికి సుభద్ర ముందుకు తూగి నాముఖభావాలు అర్థంచేసుకునే, అడుగుల్లో అడుగులు వేసుకుంటూ గేటుదాటి లోనికిపోయింది. నేనేమో అల్లానే చూస్తోన్నాను.

'మధూ! ఇంత తెల్లవారుజామున ఎక్కడకూ బయల్దేరేవు?' అన్నాడు అన్నయ్య. నేనేమీ ~~జవాబివ్వ~~లేదు.

'పరస్త్రీని వెంటబెట్టుకు పోతోన్నావుగదా! భయం వెయ్యడం లేదూ? ఏమిటీ?' అని అన్నయ్య అన్నాడు. అందులో ధ్వని నాకు తెలియకపోలేదు. కాని యిల్లా అన్నాను:

'న్యాయ చట్టాలకు నే నంత భయపడను.'

'పోనీ, న్యాయచట్టాలకు కాకపోయినా మనుష్యులకన్నా జడవవద్దూ?'

'అదే నాకింకా చేతకాని పని'

'ఎందుకు చేతోస్తుంది? రేపు శేఖరుకు నీముఖమెలా చూపిస్తావు?'

'నా కాధైర్యం లేకపోలేదు'

'అవును, వుండ కేం చేస్తుంది? నువ్వు మగవాడివే గదూ?...మరచిపోయాను మధూ! యివాళ కాకపోతే రేపైనా నీవూ, నేనూ మరిచిపోతాం. నిన్న ఏ మగవాడూ నీ ఎదట అనలేదు. అంతవరకూ నిజం! అయితే ఎవరి జీవితంకోసం నీవు దూరమైపోతున్నావో ఆ సుభద్రనే ఫలానా రోజున లేచిపోయింది అని అందరూ వ్రేలుపెట్టి చూపిస్తారు. ఏం, అది నీకిష్టమేనా?' అని అన్నయ్య అంటూంటే ఆగలేకపోయాను. కాని, నోటంబడి ఏమాటా రాక అల్లానే నిలబడిపోయాను. 'ఇంట్లోకి పద' అంటూ అన్నయ్య తిరిగేసరికి మంత్రముగ్ధుడులా నేనూ వెనకాలనే బయలుదేరాను.

సుభద్ర మన యింటిలోనే వుండిపోయింది. వెంటనే శేఖరంగారికి అన్నయ్య కబురంపి, దగ్గరి ముహూర్త మొకటి చూచి నిర్ణయించుకున్నారు.

౧౨

"అల్లా మా వివాహం జరిగింది. అయితే సుభద్రలో మాత్రం ఒక్కొక్కసారి నిరుత్సాహం కనబడేది. ఇంట్లో అత్తగారూ, తనకు ఐనవాళ్లూ మాటా మాటా వచ్చినప్పుడల్లా యీవిషయం కెలుకుతూనే వుండేవారు. నన్ను కాదని ఎలా దులపరించేసుకోగలం? అక్కడికూ ఎన్ని సూటీపోటులుగా ఎత్తిపొడిచినా, ముఖంఎదుటే అన్నా మేం చేసింది తప్పేముందని కూడబలుక్కుని మరచిపో ప్రయత్నించేది.

అల్లా దినాలు గడుపుతూనే సుభద్ర ఒక బిడ్డ తల్లి అయింది. ఎవరు మరచిపోయినా ఆడజాతి మాత్రం మరచిపోలేదు. అది నిజం! పెళ్లిళ్లలోనూ, పేరంటాలలోనూ ఎక్కడ నలుగురు స్త్రీలు కలిస్తే అక్కడనే మా విషయాలన్నీ మొదలు! సుభద్రను చూసి ఏమేమో గుసగుసలు పెట్టుకునేవారు. తమలో ఆమెను కేటాయింపుగా చూసేవారు. తాను లేచిపోయే

పెళ్లి చేసుకుందని నలుగురూ అనుకునేవారు. 'నా బ్రతుకు నలుగురులోనూ నవ్వులపాలై పోయిందిగదా' అని ఒకప్పుడు విచారించినా మనసు తిరుగవేసుకుని పొర్లుకొస్తోన్న దుఃఖాన్ని తమాయించుకునే తిరిగేది. సహజంగా ప్రతి పుణ్యస్త్రీకీ పెళ్లిళ్లన్నా, పేరంటం అన్నా ఉత్సాహం. అందులో వాళ్ల కోరిక ఆధిక్యతా, ఆనందం వున్నాయి. అయితే సుభద్రకు మాత్రం అవే ప్రాణసంకటంగా వుండేవి. చివరకు యింటికి తలదించుకుని మనోవ్యథతోనే తిరిగి వచ్చేది కాని యెన్నడూ నవ్వుముఖంతో మాత్రం రాలేదు. మొదటిలో ఎంత ఉత్సాహం వుండేదో చివరికల్లా అంత నిరుత్సాహం యేర్పడింది.

## ౧౩

"ఆనాడు పొరుగూరు క్యాంపుకు పోతోన్నాను. ప్రతిదినమూ సర్కీటుకు పోయేటప్పుడు నేనూ బట్టలవీ వేసుకునేసరికి మీపిన్ని తమలపాకులు అందించటం, సాయంత్రానికి కూర యేం చెయ్యాలో కనుక్కోవడం పరిపాటైన పని. ఆవేళ రాత్రికి యింటికి రాననీ, రేపు భోజనాల వేళకల్లా తిరిగివచ్చేస్తాననీ చెప్పేను.

'సరేగాని, ఏదైనా పొరుగూరుకు ట్రాన్సుఫరు చేయించుకోండని నే చెప్తూంటే వినరుగదూ?' అంది.

'మరి నేనూ ప్రయత్నిస్తోన్నానా? నేడో రేపో ట్రాన్సుఫరు ఆర్డరుకూడా వస్తే రానే వచ్చు' అని నే నన్నాను. అంతకంటే నేమాత్రం చెప్పాల్సిన కొత్తది యేం వుంది?

'అయినవాళ్లకు కాస్తంత దూరంగానే వుంటూంటే బాగుండేటట్లు కనబడుతూంది. వీళ్లంటే నాకు గిట్టక, యితర క్రోధాలేమీ వుండి చెప్పడం లేదుగదా? దగ్గిర వుండగానే మాటలనకపోరు. ఎంత తోసుకు తిరిగినా ఫలితం యేం వుంది చెప్పండీ? ప్రతిరోజూ దీనిగురించే యేదో నెపంతో రగడ పెరుగుతూనే వుంది గదా? పోయిన పొడుగూతా యిల్లా అయితే మన శ్శాంతి ఎలా వుంటుందో మీరే చెప్పండి? ఇక నే నీమాటలు పడలేను సుమండీ' అని చెప్తూతూ తలవంచుకుంది. నేలమీద బొటనవేలితో రాస్తూ 'యిన్నాళ్లూ సహించి వూరుకున్నాను' అంటూంటే కన్నీరు బొటబొటా ఆమెబొటనవ్రేలిమీద రాలేయి. ఇంతకాలమైందిగాని మా వివాహమై- ఎన్నడూ కూడా సుభద్ర కంట తడిపెట్టగా నే చూడలేదు. కాని ఆమె యింతకుముందుయిల్లా ఎన్నిసార్లు దుఃఖించి వుంటుందోగదా అని యిప్పుడిప్పుడు అనుకోవలసి వస్తోంది.

'ఎంత దూరమైనా మన చెవులకు వినబడకపోతే వినబడకపోవచ్చును గాని వాళ్ల మనస్సుల్లో మాత్రం నీచపుతలపులు నన్ను తొంగిచూడకుండా వుంటాయంటారా? సరే! వెళ్లిరండి' అంటూనే చీర చెంగుతో కళ్లు తుడుచుకుంటూ లోనికి పోయింది.

నేను క్యాంపుకు పోయానన్నమాటేగాని మనస్సులో ఆవేదనా, ఆందోళనా యెక్కువయాయి. ఆ రాత్రంతా మనసు చికాకుగా వుండి నిద్రపట్టనే లేదు. మళ్లీ ఆనాటినుంచి యీ నాటివరకూ కూడా సరియైన నిద్ర నే నెరుగనే ఎరుగను! ఆ రాత్రంతా మీపిన్నే కళ్లకు కట్టినట్లు కనబడేది. మా ప్రథమ పరిచయపు దినాలు-ఆనాడు వెన్నెల్లో మేం బయలుదేరడం, మా వివాహం, లలిత పుట్టడం, క్యాంపుకు పోయేముందు కంటతడిపెట్టడం- వూసగుచ్చినట్లు ఒకదాని వెంబడి ఒకటి నాతలంపుకు వచ్చాయి. ఆనాడు మనస్సు కలవరపడింది. నిద్రపట్టక పక్కంతా తేళ్లూ, జెఱ్ఱులూ ప్రాకినట్లు అయింది. ఆనాడు అల్లానే తెల్లవారిపోయింది.

ఉదయపు పని పూర్తిచేసుకుని మనోవ్యాకులతతో యింటికే బయలుదేరాను. మధ్యదారిలోనే బంట్రోతు ఎదురై 'అమ్మగారు తమర్ని తీసుకురమ్మని పంపేరు' అన్నాడు. 'ఏ అమ్మగారురా' అని నే నడగనూ లేదు, వాడు చెప్పనూ లేదు. ఎందుకైందీ సరిగ్గా తెలియదని మాత్రం చెప్పేడు. నిన్న నేను వచ్చేటప్పటి స్థితికీ...ఏదో మొత్తానికి అవాంతరమేజరిగి వుంటుందనుకుని కాళ్లలో సత్తువునంతా వినియోగించానుగాని సైకిలు కదలడం లేదనిపించేది. మనోవ్యాకులంతో యింటికొచ్చి పడ్డానేగాని నావ్యాకులం

తీర్చేందుకు యిల్లాలు ఎదురైందికాదు. బంట్రోతు లందరూ ముఖాలు చాటేసుకుంటూ వెనక్కి పోయారు. నన్ను చూడగానే 'అవురు' మంటూ నానమ్మ యేడుస్తోంది. ఇంకేం కావాలి! అవాల్సింది కాస్తా అయిపోయింది. నాకొంపే నిలువునా కూలిపోయింది. ఇంటికొస్తే యేముందీ? ఎవరికోసమైతే అహర్నిశలూ ఆలోచిస్తోన్నానో, ఎవరి సుఖసౌఖ్యాలకైతే ఆరాట పడుతోన్నానో ఆ సుభద్రనే భగవంతుడు తన్నుకు పోయాడు. నా జీవితగాథే ముగిసిపోయింది. మళ్లీ ఏం తటస్థించిందో ఏమో! లేకపోతే ఆత్మహత్యకు ఎందుకు వడికట్టుకుంటుంది?

ఆమాత్రం తెలియనిదా సుభద్ర? ఇల్లా అనుమానంతో క్రుళ్లి కృశించిపోయేదానికంటే ఆత్మహత్యే మేలనుకుంది. 'సుభద్ర నవ్వుముఖంతోనే వెళ్లిపోయిం' దని అందరూ అనుకున్నారే గాని ఆ నవ్వువెనకాల ఎంత విషాదం వుందో, ఎంత విరక్తి వుందో వాళ్లకేం తెలుసు? నాకు తెలుసు! నాలాంటి అభాగ్యులకు తెలుసు! ఆనవ్వు వాళ్లకేమైనా కలిగించవచ్చు. కాని నాకో? ఆనవ్వే నా హృదయాన్ని దొలిచేసింది. నా జీవితంలో తీపిని విరిచేసింది.

ఇక నాకీ లోకంతో పనిలేదన్నట్లు లలితనూ, యివే నా ఆఖరుమాట లన్నట్లు ఒక వుత్తరాన్నీ చూచి చదువుకోమని దాచిపెట్టిపోయింది. నన్నింకా ఈ లోకంలో వుట్టిగట్టుకుని వూరేగమనీ, తన ఆయుస్సు కూడా పోసుకుని క్రుళ్లి కృశించిపొమ్మనీ తాను తప్పుకుంది.

## ౧౪

"మీ పిన్ని వ్రాసిన ఆ ఉత్తరంలోని సారాంశం యిది :—

'మొట్టమొదట మిమ్మల్ని నే కోరుకోగలిగేది క్షమాపణ తప్ప యింకేం వుంటుంది గనుక? సుభద్ర యిల్లా చేసిందని మీరైనా నన్ను తూలనాడకుండా నిజాన్ని గ్రహించి, నా జన్మ విముక్తికిగాను విచారించండి. అది చాలు.

అంత్యక్షణాలల్లో మీముఖం చూడలేకపోయానని నా ఆత్మ ఎంత పరితపిస్తోందో! మీరూ అదే కోర్కెతో కలవరపడతారని నాకు తెలుసు. కాని నే నేం చెయ్యగలను?

ఆత్మహత్యను శాస్త్రపురాణాలూ, సాంఘిక రాజకీయ ధర్మాలూ నిషేధించాయనీ యెరుగుదును. అంతవరకూ ఎందుకూ? స్వీయధర్మాలే ఎదురుతిరిగేయి గాని, అంతకంటె వేరే గత్యంతరం లేనివాడు, ఏం చెయ్యగలను? నలుగురిలోనూ నాకూ తగిన స్థానం చిక్కనప్పుడు ఒక జీవచ్ఛవంలాగ, ఒక మరబొమ్మలాగ వుండిమాత్రం ఏం ప్రయోజనం చెప్పండి?

నేనూ బీదయింటి పిల్లనై పుట్టినా మాది పేరు ప్రతిష్ఠలు గల వంశం. కుటుంబమూను. మొదటినుంచీ నలుగురిలోనూ తలయెత్తుకుని తిరిగినదాన్ని గాని ఒకరిచేత వ్రేలు చూపించుకుని ఎరగను. స్కూల్లోనూ, స్నేహితుల్లోనూ, చివరకు బంధువర్గంలోనూ మంచిదనిపించుకున్నాను. ఆరోజుల్లో 'సుభద్ర మహామంచిది అవుతుందమ్మా' అని వూరూ వాడా చెప్పుకోవడం నేను బాగా ఎరుగుదును. చదువుకునే రోజుల్లో అన్నిటిలోనూ నాదే ముందంజ! అల్లా బాల్యం గడిపి, తలిదండ్రులకు కరువై, నా అనే దిక్కుకు దూరమై యిల్లా మీ ఆశ నిరాశచేశాను. చివరికల్లా నేను ఎవరినీ కూడా సుఖపెట్టినదాన్ని కాకపోయాను!

ఆ వేళావిశేషమే అనండి, లేక మరేమైనా అనుకోండి. మొత్తంమీద మన యిద్దరిలోనూ ఒక మార్పు కలిగినమాట నిజం. నవ్వుతూ నవ్వుతూ యిద్దరంకూడా ప్రేమబంధంలో చిక్కుకున్నాం. చివరికల్లా ఆప్రేమసయ్యాటలు యిల్లా పరిణమించి జీవితంలో ఆశల్నీ, ఆనందాన్నీ లాక్కుని విరక్తిని పంచిపెట్టేయి.

ఎంత పని చేశావు సుభద్రా అంటే చెయ్యనూ మరి! జీవితంలో ఆశ అనేది ఒకటే వుంటేగదూ? ఆశ నిరాశ అయింది. ఉత్సాహం అడుగట్టింది. ప్రాణం అంటే తీపి నశించింది. ఎన్నాళ్లని ఒక జీవచ్ఛవంలాగ,

ఒక యంత్రంలాగ జీవించేది? ఏం అనుభవించడానికి జీవించాలి? తిని తిరగడానికే కదూ? అంతేగాని, పేరు ప్రఖ్యాతులు గడించుకుంటానన్న మాట ఏమైనావుందా? కల్ల! పూర్వపుసంగతులే మనసులో పెట్టుకున్న ఆత్మీయులవద్దనే మంచికి పోయినా చెడు వస్తోనేవుంది. కనుక బ్రతికినా వచ్చేది అపఖ్యాతి తప్ప మరేం లేదు గదూ? ఇక దేనికోసం బ్రతికివుండాలో నాకే అర్థం కాలేదు.

నిజంగా నే చేసిందిమాత్రం తప్పేముందీ? కులీనుణ్ణి—విద్యావంతుణ్ణి — నన్నెరిగిన ఒక స్వకులస్థుని ప్రేమించి ప్రేమింపబడ్డాను. చివరకు నీతికి నిలబడి, ఎన్ని అవాంతరాలు వచ్చినా అతనికే సతి నయాను. అంతేనా, అంతకన్నా వేరేపాపాని కేమైనా వడిగట్టుకున్నానా? ఎందరు ఎన్నాడిపోసుకున్నా వినీ విననట్లూ, నన్ను కానట్లూ యింతవరకూ జీవితాన్ని దొర్లించుకొచ్చాను. సమయం వచ్చినప్పుడు నలుగురూ 'ఛీ' అని ముఖంమీద వూస్తోంటే ఎన్నిరోజులని తుడుచుకుంటూ వూరుకోగలను? యితరులచేత పల్లెత్తుమాట పడి ఎరగని మనని యితర్లు తమంతో నీచులను కోవచ్చు. కాని మన ఆత్మలుమాత్రం వారు వూహించుకుంటూన్నంత కఠినంమాత్రం కావుసుమా! పాషాణహృదయాలకూ, కరుడుకట్టిన కఠినహృదయాలకూ లోకంతో పనిలేనట్లే వాళ్లు కల్పనారాజ్యాల్లో విహరిస్తోంటారు. అసలు నిజంగా లోకం వాళ్లను శాసించనేలేదు!

ఇవన్నీకూడా ఓర్చుకోగలిగినన్నాళ్లు ఓర్చుకున్నాను. చివరికల్లా నాలోనూ సహన శక్తి నశించిపోయింది. యిల్లా అవమానంతో ఆవేదనపడేదానికంటే కూడా ఆత్మహత్య చేసుకోవడమే సులభమనీ, చెయ్యతగ్గదనీ తెలుసుకోగలిగేను. వీటి అన్నిటినుంచీ—చివరకు ప్రపంచంనుండే మరుగుపడిపోతోన్నాను. మన యిద్దరి విషాదజీవితాలకూ లలితను గుర్తుగా చూచుకుంటూ మీరైనా పెంచి మీ ఋణాన్ని తీర్చుకోండి. ఇదే నా చివరికోర్కె. ఇంతకంటే వేరే నే కోరేదీ, మీరు చెయ్యతగ్గదీ ఏం వుంది గనుక ?'

౧౫

"ఆ వుత్తరం చూచుకుని నిలువునా నీరైపోయాను. దీనికంతకూ హేతువు నేనేనని నాకూ తెలుసు. ఇప్పుడు ఏం తెలిస్తేమాత్రం ఏం ప్రయోజనం? యిన్నాళ్లూ తల్లిలేని యీ లలితను సాకుకొనివచ్చాను. కాని యీ ఐదారు సంవత్సరాలూ నా జీవితంలో ఐదారు యుగాల్లాగ అతికష్టంమీద గడిచాయి. మనోవ్యథచేత నాలో నేనే కుమిలిపోయాను. అంతే అవకపోతే యీ ప్రపంచంలో ఏంచూచుకుని మురిసిపోయేది? ప్రపంచంలో నే కోరతగ్గదీ, అనుభవించతగ్గదీ ఏంలేకపోయినా యీ నాబిడ్డకోసం ఇంకా నేజీవించడం అవసరమైంది. లేకపోతే నేనింకా యిలాజీవించవలసిన పనేనా? ఏంలేకపోయినా భగవంతుడు యీఅడ్డు ఒకటిమాత్రం పెట్టేశాడు. నాజీవితంలో నాకష్టసుఖాలు గ్రహించుకుని పంచుకునేదీ, యింట్లో కలకల్లాడే గృహలక్ష్మి పోయిననాడు నాకోసం దుఃఖమూ, దుఃఖంకోసం నేనూ మిగిలిపోయాం. ఆహారసుఖసౌఖ్యాలకు దూరమైపోవడాన్ని, అన్నిటికంటె విపరీతంగా మనోవ్యథవల్లా రక్తపుపోటు ఎక్కువైంది. నిద్రాహారాలు సరిగ్గా లేక శరీరం శుష్కించిపోయింది. క్రమేణా చిన్న దగ్గులోకి దించింది. మదనపల్లి నుంచి వచ్చి అంతా పదిమాసాలౌతుందేమో! తిరిగి వ్యాధి యిల్లా పరిణమించింది. అసలు మొదటిలోనే నమ్మకం చెప్పలేకపోయారు. ఇంకా యిప్పుడు యీస్థితిలో ఒకళ్లు చెప్పాల్సిందేముందీ? యీక్షయ నావూపిరితిత్తులను తూట్లు తూట్లు చేసేసింది. ఎముకఎముకకూ క్రిములుప్రాకిపోయి పీల్చి పిప్పిచేసేస్తోన్నాయి. చేసేసినాయి కూడా! నేను కోరుకుంటూందికూడా యిదే. దీనివల్ల నాకేం విచారం లేదు. పైగా సంతోషిస్తోన్నాను. అయితే సర్వశూన్యం అనుకున్న యీలోకంలో యింకా యీ లలితప్రాణమే నన్ను వ్యథతో వెనక్కిలాగింది. ఇన్నాళ్లూ నేనూ అందుకే గడుపుకొచ్చాను. ఇకమీదట ఏది ఎలాగైపోయినా నేనుమాత్రం చూచేదిలేదు. అసలు ముందు నేను వుండడం అంటూ వుంటేగదూ? సూర్యోదయం కాస్తా కాకుండానే దాటిపోతానని నాకు గట్టిగా తెలుసు" అంటూ ఆగిపోయాడు.

"బాబాయ్! పదిసార్లూ అదే మనసులో పెట్టుకుంటే ఎలా?" అని అనడమే నాకు కష్టం అయిపోయింది. గొంతుక పూడుకుపోయింది.

"నీకెందుకూ ఆపిచ్చభ్రమ! యింకా బాబాయి తిరిగి మళ్లీ మనిషి అవుతాడనీ, తిని తిరుగుతాడనీ నా నీవుద్దేశ్యం? అదిమాత్రం పట్టిది! నేను సూర్యోదయం కూడా చూస్తానా! నిన్నూ, నాన్ననూ పిలవబంపింది మీ ముఖాలు చూడాలన్న అభిలాషతోనే కాదు. లలితను మీకు అప్పజెప్పి, నా తుది కోర్కెను తెలియజేయడానికి" అంటూ లలితవంక చూచాడు. ఆపాకలో నిర్విచారంగా నిద్రపోతోంది ఒక్క లలిత మాత్రమే.

"లలిత లేచిపోయినదాని కూతురనీ, తల్లికంటే ఏడాకులు ఎక్కువ చదివిన పిల్లేనమ్మా అనీ, ఇంకా ఏమేమో అనుకుంటూంటారు. మీరు అవి లక్ష్యం చేసుకోక...."

"ఎంతమాటన్నారు బాబాయ్" అనేశాను.

"అల్లా మీరు అనలేరని నాకు తెలియనిదికాదు. ఇతర్లు అనవచ్చు. పెంచి పెద్దదానిని చెయ్యి. నీకు తెలియని విషయం కాదు. కాని చెప్పవలసిన బాధ్యత నాలో వుంది కనక! దానికీ మనకూ అనుగుణ్యంగా ఒక యింటిదాన్ని చెయ్యండి. అంతే. మీ బాబాయి కోరుకునేదీ, నీవు నీ కర్తవ్యాన్ని నిర్విఘ్నంగా కొనసాగించాలిసిందీ యిదే! నీవు నా కుమారుడవు కాకపోయినా మా కుమారుడవే! నీవూ నాన్నంతటివాడవు అయావు గనుక యీ విషయం నాన్నతో చెప్పినా, నీతో చెప్పినా ఒకటే. కాని నాన్నను చూడాలని మనసు పరితపిస్తోంది. నాన్న వస్తాడంటావా?" అని అడుగుతోంటే, "తప్పక వస్తారు" అని పరధ్యాన్నంగా జవాబిచ్చాను.

"—చూచావా? నాజీవితం ఎంత తెలివితక్కువగా ధ్వంసం అయిపోయిందో. నేనూ చెడిపోయాను, సుభద్రనూ చెడగొట్టినవాడనయాను. మొదటలో నేనూ అందరికిమల్లేనే 'లోకులతో నాకేం పని? సంఘానికీ, నాకూ సంబంధం లేదు. దాన్ని ఎదిరించగలనుగాని, సంఘంకోసం నాయావజ్జీవితం పాడుచేసుకుంటానా?' అనుకున్నాను. నవ్వుతూ నవ్వుతూ నడుం బిగించాను కాని చివరికేమైందీ? అది పుస్తకాలల్లోనూ, సినీమాల్లోనూ, యింకా కొందరి మనస్సుల్లోనూ కనిపించేది తప్ప స్వానుభవంలో కనబడేదిమాత్రం కాదని యిప్పటికి తెలుసుకున్నాను. సంఘాన్ని వుల్లంఘించడం అంటే అనుకున్నంత సులభమైంది కాదు నాయనా! సంఘంతో మనలాంటివాళ్లకు పనివుంది. 'దానితో మన కేం పని? మనదారి మనదే' అంటే అది యశస్సు గడించుకుందా మనుకునేవాడి లక్షణంమాత్రం కాదు. ఏదో యింత సంపాదించుకుని మనమట్టుకు మనం తింటాం పోతాం అంటే అది ఒక లెక్కలోది కాదు. వాళ్ల గురించి నేను చెప్పడం లేదు. అయినా అదేనా మనం ప్రపంచంనుండి కోరుకోతగ్గది? సంఘాన్ని వుల్లంఘించి బ్రతికేవాళ్లూ వున్నారని నీవనవచ్చు. వాళ్లు ప్రపంచంలో యేది యెల్లా పోయినా మరేం పర్వాలేదనుకున్నంత కఠినహృదయులన్నా అవాలి; లేదా, వాళ్లూ నావలెనే చావలేక బ్రతికేవాళ్లని మాత్రం యికనైనా తెలుసుకో!" అని చెప్తూన్నాడు. గుళ్లో గంటలు వినబడుతోన్నాయి.

"తెల్లవారవస్తోంది. నా జీవితం కూడా తెల్లవారిపోతూంది. అయ్యో! అన్నయ్య రాలేదే! అన్నయ్యను చూడ్డానికికూడా యీ పాపిష్ఠి కళ్లు నోచుకోలేదేమో" అంటూ అటూ యిటూ పక్కమీద దొర్లుతూన్నాడు. పక్క కుదరడం లేదు. తిరిగి నా ముఖంలోకి చూస్తూ, "సంఘాన్ని ఎదుర్కోవాలన్ననాడు తాను కాఠిన్యం వహించగల శక్తి ఉన్ననాడే పాల్గొనాలి. ఒకసారి అందులో అడుగు పెట్టేక లోకం ఎన్ని అనుకున్నా, ఎంత విషమస్థితి యేర్పడినా, చివరకు పిడుగులు వచ్చి అమాంతంగా నెత్తిమీద పడుతున్నా సరే కరుడుగట్టిన హృదయంతో మళ్లీ వెనక్కుమాత్రంతిరిగి చూడకూడదు. లోకంతో వాడికీ పనిలేదు, వాడితో లోకానికీ పనిలేదు. అయితే అప్పటి ఆవేశంతోమాత్రం ప్రవేశిస్తే వాళ్లకూ నాగతే. యీ మాటలన్నీ నీ మనసులో వుంచుకో. చచ్చేటప్పుడు సంధిసూత్రంలాగ ఇవి యిప్పు డెందుకంటే, నా అనుభవంలో గ్రహించింది చెప్పి నాభారంతీర్చుకోవడానికే! కీర్తిగాని అపకీర్తిగాని

లోకులు అనుకునేది యేదో అదే లోకంలో పాతుకు పోతుంది తప్ప మన మనస్సులూ, మన ఆశయాలూ లోకానికి తెలియవు గదా!" అని అంటూంటే ఆ మాటల్లో వున్న ధ్వని నన్ను క్రుంగతీసేసింది. తిరిగి కొంచెం పాలు పోస్తే గుటకలు వేసేడు. కొద్దిగా మగత వచ్చినట్లు ఒక అరఘడియసేపు కళ్లు మూసుకున్నాడు.

౧౬

అందరూ ఒకర్ని ఒకరు ముఖభావాలతోనే అర్థం చేసుకుంటూ రోగిని ఒక కంట కనిపెట్టి చూస్తూ కూర్చున్నారు. లలితకు అప్పుడే మెళుకువ వచ్చి తండ్రితలవద్ద కూర్చుని కునుకుపాట్లు పడుతోంది. పాపం! ఏడెనిమిదేండ్ల పిల్ల! ఆంజనేయస్వామిగుళ్లో గంటలు మారుమ్రోగుతోన్నాయి. సంక్రాంతికోడిపుంజులు కూస్తోన్నాయి. కాకులు కూడా 'కావ్ కావ్'మంటూన్నాయి. అప్పుడే వచ్చిన వెన్నెల గుడ్డిగా వుంది.

"అమ్మా!"అంటూనే బాబాయి అంతలోనే తేఱుకుని పాలచూచాడు. నేనూ, నానమ్మా గదిలోకి పోయాం.

"అమ్మా! అన్నయ్య రాలేదుగదూ? హూ" అని దీర్ఘనిశ్వాసలు విడుస్తూ,"అమ్మా! లలిత ఎక్కడ? ఏదమ్మా, చూడు! ఇదిగో...నానమ్మ, అన్నయ్య, గాబరాగా వుందే!" అనగానే వసారాలోవాళ్లందరూ వచ్చి మంచంచుట్టూ నిలుచుని చూస్తోన్నారు.

"అమ్మా, ఎక్కడ?"

"నీతలవద్ద"

"ఆఁ?" అంటూంటే నానమ్మ తులసిరసం నోట్లో వేసింది.

"అమ్మా!........."అంటూనే కళ్లు మూతలు పడ్డాయి.

బయట బండిశబ్దం అయింది. నేను పాకబయటకు వచ్చేశాను. నాన్నా, అమ్మా ఆదుర్దాగా నన్నూ, నాముఖలక్షణాలనూ చూస్తూ లోనికి పరుగెత్తేరు. అందరూ లోపల గొల్లుమన్నారు. తుగిడీలు తుగిడీలుగా కృష్ణుడు పోతోన్న భజనధ్వనులుతప్ప నాకింకేమీ వినబడలేదు.

రోడ్డుమీద కణకణలాడుతోన్న నిప్పురవ్వలూ, భగభగమండే భోగిమంటల శిఖలూ పైకి లేచిపోతున్నాయి. ఇంకా చితుకులు జతపరుస్తోన్నారు. దుఃఖభారంతో నాగొంతు నెప్పిగావుంది. కళ్లలో నీళ్లు సుళ్లు తిరిగి భోగిమంటలు దూరదూరమైపోతోన్నాయి. కాని యింకా భోగిమంటలనుంచి వెచ్చని వేడిగాలులు మాత్రం నావరకూ వస్తోనే వున్నాయి!

